సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



భీం ఆశయం నెరవేరేదెన్నడో?

కుమురంభీం అసువులు బాసి ఏళ్లు గడుస్తున్నాయి. అయినా ఆదివాసీల పరిస్థితి దయనీయంగా ఉంది. గిరిజన చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదు. 8లో ▸

రాయిని చెక్కి.. జీవం పోసి



రాయిని చెక్కి.. తన కళతో జీవం పోస్తూ అద్భుత శిల్పాలుగా రూపొందిస్తున్నాడు ఇచ్చోడ మండలం అడేగామ(కె) గ్రామానికి చెందిన కుంబోజి భాస్కర్. 9లో ▸

గరిష్టం/కనిష్టం
30.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ నగేశ్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇందులో పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, రాజలింగు, బాలాజీ, తుకారాం, రాజేశ్వర్, హనుమంత్ రావ్, మారుతి, దిలీప్ తదితరులున్నారు.

జాతీయ రహదారిపై కంటైనర్‌ను ఢీకొన్న లారీ



మంటల్లో కంటైనర్

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది సమీపంలో గల జాతీయ రహదారిపై ఆదివారం ఓ కంటైనర్‌ను లారీ ఢీకొన్న ఘటనలో మంటలు లేచి ఆ వాహనాలు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న కంటైనర్ వెనకాలే మరో లారీ వస్తోంది. అయితే కంటైనర్‌ను వెనుక వస్తున్న లారీ వేగంగా ఢీకొని ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో ఘర్షణ ఏర్పడి మంటలు చెలరేగాయి. కంటైనర్‌లో ఉన్న దుస్తులు, ఇతర ఆయుర్వేద మందులు పూర్తి గా దగ్ధమయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు వాహనాల ను అక్కడే వదిలి పారిపోయారు. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే కంటైనర్ పూర్తి స్థాయిలో దగ్ధమవగా.. లారీ పాక్షికంగా కాలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదని స్థానికులు తెలిపారు.

నిఘా కట్టుదిట్టం



- ఎన్నికల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తం
- మద్యం, డబ్బు తరలింపుపై ఫోకస్
- రంగంలోకి ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీలు
- రౌండ్ ది క్లాక్ విస్తృత తనిఖీలు
- రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఎస్‌టీ అధికారులు

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధానంగా మద్యం, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టింది. నిరంతర నిఘా ఉంచేందుకు వీలుగా జిల్లాలో 14 ఫ్లయింగ్ స్క్వాడ్, మూడు స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను నియమించింది. రెవెన్యూ, పోలీస్ శాఖలతో పాటు ఇతర శాఖల డివిజన్ స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించింది. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో వాహన తనిఖీలు ముమ్మరం చేశాయి. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల వద్ద రౌండ్ ది క్లాక్ నిఘా ఏర్పాటు చేశారు. రూ.50వేలకు మించి నగదును ఆధారాలు లేకుండా తరలించినట్లయితే సీజ్ చేయనున్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా..

ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు అక్రమాలకు ఆస్కారమిచ్చే అనుమానాస్పద ప్రాంతాల్లో స్టాటిక్ సర్వేలెన్స్ టీం (ఎస్ఎస్‌టీ)లను ఏర్పాటు చేశారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టు భోరజ్‌తో పాటు ఉట్నూర్ ఎక్స్ రోడ్, నేరడిగొండ టోల్ ప్లాజా వద్ద నిఘా ఉంచేందుకు వీలుగా మూడు టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో ఇద్దరు నాయబ్ తహసీల్దార్లు, ఒక పోలీస్ అధికారిని నియమించారు. ఏఎస్‌డబ్ల్యూవోకు బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు వీడియోగ్రాఫర్ నిత్యం వెంట ఉండనున్నారు. రౌండ్ ది క్లాక్ తనిఖీలు చేపట్టనున్న ఈ బృందాల్లో ఓ అధికారి ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు మరో అధికారి సాయంత్రం ఆరు నుంచి మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించనున్నారు. ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ మద్యం, డబ్బు తరలించకుండా చర్యలు తీసుకోనున్నారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు..

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా ఆదేశాల మేరకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ ప్రత్యేక బృందాలు ఆదివారం నుంచి రంగంలోకి దిగాయి. ఎఫ్ఎస్‌టీలు తమకు కేటాయించిన మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు పర్యవేక్షణతో పాటు అభ్యర్థుల ఖర్చులపై నిఘా ఉంచనున్నారు. మద్యం, డబ్బు తరలిస్తూ పట్టుబడితే సీజ్ చేస్తారు. చెక్‌పోస్టుల వద్ద ఉండే ఎస్ఎస్‌టీలు వాహన తనిఖీలు ముమ్మరం చేశాయి.

రూ.50వేలకు మించి తరలిస్తే సీజ్..

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నందున ప్రజలు రూ.50వేలకు మించి నగదు తరలించొద్దు. ఒకవేళ తరలిస్తే దానికి సంబంధించిన రశీదులు చూపించాలి. లేకుంటే ఆ నగదును సీజ్ చేస్తారు. ఇక అక్రమంగా మద్యం తరలిస్తే మాత్రం సరుకు సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కేసులు నమోదు చేస్తారు. అలాగే రూ.10వేలకు మించి గిఫ్టులను తరలించినట్లయితే వాటిని కూడా సీజ్ చేయనున్నారు.

విస్తృత తనిఖీలు..

ఎంపీటీసీ, జెడ్పీటీసీ తొలివిడత ఎన్నికల నామినేషన్ల గడువు సమీపిస్తోంది. ఈ క్రమంలో బరిలో నిలిచే అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు గాను మద్యం, నగదు, బహుమతులు వంటి ప్రలోభాలకు గురిచేసే ఆస్కారముంటుంది. అయితే వీటికి చెక్ పెట్టేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం దిగుమతికి అవకాశం ఉండటంతో దాన్ని కట్టడి చేయడంపై దృష్టి సారించింది. అలాగే క్షేత్రస్థాయిలో పకడ్బందీ నిఘా ఉంచేలా 14 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసింది. ఇచ్చోడ – సిరికొండ, బోథ్ – సొనాల, జైనథ్ – భోరజ్, బేల –సాత్నాల, తాంసి – భీంపూర్, నార్నూర్ – గాదిగూడ వంటి రెండేసి మండలాలకు ఒక టీంను ఏర్పాటు చేయగా మిగతా మండలాలకు ఒక్కో టీం చొప్పున మొత్తం ఏర్పాటు చేశారు. గిరిజన సంక్షేమ అధికారులు, మిషన్ భగీరథ ఏఈలు, నాయబ్ తహసీల్దార్లు, ఐకేపీ ఏపీఎంలు, మండల వ్యవసాయాధికారులు టీం లీడర్‌గా వ్యవహరిస్తారు. ప్రతీ బృందంలో ఒక పోలీస్ అధికారి, ఓ వీడియోగ్రాఫర్ కలిపి ముగ్గు రు ఉండనున్నారు. అలాగే ముగ్గురు అధికారులను రిజర్వ్‌లో ఉంచారు. ఈ బృందాలు తమకు కేటాయించిన మండలాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టనున్నాయి.

నిరంతర నిఘా



స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలి. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలు చేపట్టొద్దు. జిల్లాలో నిరంతర నిఘా ఉంచేందుకు వీలుగా 14 ఫ్లయింగ్ స్క్వాడ్, మూడు స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను నియమించాం. ఎక్కడైనా 'కోడ్' ఉల్లంఘన జరిగినా, మద్యం, నగదు, బహుమతులు పంపిణీ చేసినట్లు తెలిసినా వెంటనే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబర్ 18004251939 కు సమాచారం అందించాలి. వాటిపై సత్వరమే స్పందించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– రాజర్షి షా, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

ఆమెదే ఆధిపత్యం

- ఓట్లు, సీట్లలో అతివలదే హవా
- జనరల్ స్థానాల్లోనూ పోటీకి అవకాశం
- స్థానిక ఎన్నికల్లో పెరగనున్న ప్రాతినిధ్యం



కైలాస్‌నగర్: స్థానిక సంస్థల్లో మహిళలకు అగ్రపీఠం దక్కనుంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తలరాత మార్చగల శక్తితో పాటు ప్రజాప్రతినిధులుగానూ సత్తా చాటేందుకు ఆమెకు అవకాశం కలగనుంది. స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కోటా అమలు చేస్తున్నారు. దీంతో వారికి కేటాయించిన స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లోనూ పోటీకి అవకాశం ఉంది. ఫలితంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డుమెంబర్ వంటి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగనుంది. తద్వారా అన్ని రంగాల్లో రాణిస్తున్న అతివలు రాజకీయంగానూ ఆధిపత్యం చాటేందుకు తోడ్పడనుంది.

మహిళా ఓటర్లే అధికం..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఇటీవల ఓటరు జాబితా ప్రకటించింది. జిల్లావ్యాప్తంగా 20 గ్రామీణ మండలాల పరిధిలో మొత్తం 4,49,981 మంది ఓటర్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఇందులో పురుష ఓటర్లు 2,19,652 మంది, మహిళా ఓటర్లు 2,30,313 మంది, ఇతరులు మరో 16 మంది ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లు 10,661మంది అధికంగా ఉన్నారు. ఉట్నూర్ మండలంలో అత్యధిక మంది మహిళా ఓటర్లు ఉండగా జిల్లాలోని సగానికి పైగా మండలాల్లోనూ మహిళా ఓటర్లదే పైచేయిగా ఉంది. దీంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే శక్తి వారికుంది. ఈక్రమంలో రాజకీయ పార్టీలన్నీ వారి మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తున్నాయి. వారి అనుగ్రహం ఉంటే గెలుపు ఖాయమనే ధీమాతో ముందుకు సాగుతున్నారు.

సీట్లలోనూ వారిదే హవా...

ఓట్ల పరంగానే కాకుండా సీట్లలోనూ మహిళలదే ఆధిపత్యం సాగనుంది. 50 శాతం రిజర్వేషన్ల అమలుతో పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో సగం సీట్లు వారికే కేటాయించబడ్డాయి. జెడ్పీటీసీలు పది స్థానాలు మహిళలకు కేటాయించగా మరో పది స్థానాలను జనరల్‌కు కేటాయించారు. అలాగే ఎంపీపీ స్థానాల్లో 8 మహిళలకు, 12 స్థానాలను జనరల్‌గా కేటాయించారు. ఇవే కాదు అటు సర్పంచ్, వార్డుమెంబర్ పదవులను సైతం సగం సీట్లను మహిళలకే రిజర్వ్ చేశారు. ఈ స్థానాలతో పాటు జనరల్‌లోనూ మహిళలు పోటీ చేసేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయడంలో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. ఇదిలా ఉంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయనుండడంతో వారి ప్రాతినిధ్యం పెరగనుంది.

జిల్లాలోని ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు
ఆదిలాబాద్‌రూరల్	13,854	14,674
బజార్‌హత్నూర్	11,687	12,141
బేల	13,825	13,762
భీంపూర్	9,312	10,166
భోరజ్	7,302	7,656
బోథ్	13,022	14,236
ఇచ్చోడ	17,131	18,114
గాదిగూడ	7,695	8,104
గుడిహత్నూర్	12,361	12,929
ఇంద్రవెల్లి	16,033	16,416
జైనథ్	9,741	10,253
మావల	2,103	2,283
నార్నూర్	11,606	11,775
నేరడిగొండ	11,517	12,352
సాత్నాల	5,271	5,421
సిరికొండ	6,431	6,714
సొనాల	5,293	5,511
తలమడుగు	13,481	14,376
తాంసి	6,515	7,267
ఉట్నూర్	25,472	26,163

సాగు నీరందేదెప్పుడో?

- మత్తడివాగు కుడికాలువ పనులు పూర్తి
- ఏడాదైనా ప్రారంభానికి నోచుకోని వైనం
- ప్రభుత్వం త్వరగా స్పందించాలని రైతుల వేడుకోలు

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణ పనులు పూర్తయి ఏడాది దాటినా ఆయకట్టు రైతులకు సాగునీరందని పరిస్థితి. పనులు పూర్తవడంతో అధికారులు ట్రయల్‌రన్ సైతం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది క్రితం జిల్లా పర్యటన సందర్భంగా దీనిని ప్రారంభిస్తారని అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే సీఎం పర్యటన వాయిదా పడటంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది.

రూ.7.34 కోట్లతో పనులు

తాంసి మండలంలోని వడ్డాడి సమీపంలో రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 20 ఏళ్ల క్రితం మత్తడివాగు ప్రాజెక్టు పనులు చేపట్టారు. 2008లో ప్రాజెక్టును ప్రారంభించారు. ఎడమకాలువ ద్వారా ప్రస్తుతం 8500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నిర్మాణ సమయంలో కుడికాలువ పనులు చేపట్టలేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఈ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నూతన సాంకేతికతో పైపులైన్ ద్వారా భూసేకరణ సమస్య లేకుండా వడ్డాడి, హస్నాపూర్, ఖోడద్, పొన్నారి శివారు రైతులకు నీటిని అందించాలని నిర్ణయించారు. 1200 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా 2017లో రూ.7.34 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు గుత్తేదారు పనులను ఏడాది క్రితం పూర్తి చేశారు. ట్రయల్‌రన్ సైతం సక్సెస్ కావడంతో పోయిన సంవత్సరం రబీ నుంచి సాగు నీరు అందుతుందని రైతులు ఆశపడ్డారు. అయితే ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం.

పైపులైన్ ద్వారా చేలకు నీరు

కుడి కాలువ వద్ద పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టి అందులో మోటార్లను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి భూగర్భ పైపులైన్ ద్వారా చేలకు నీరు అందేలా పనులు పూర్తి చేశారు. మొత్తం 9 కిలోమీటర్ల మేర ప్రధాన పైపులైన్‌తో పాటు 25 బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. ప్రతీ బ్లాక్‌కు ఐదు ఆటోమెటిక్ వాల్వ్‌లను ఐదెకరాలకు ఒకటి చొప్పున బిగించారు. నీటి వృథా అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఏడాదైనా ప్రారంభానికి నోచుకోని పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పూర్తయిన పంపుహౌస్ నిర్మాణం

వెంటనే సాగు నీరందించాలి



ప్రాజెక్టు కుడికాలువ లేక ఏళ్లుగా ఎదురుచూశాం. ఇప్పుడు పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోక సాగునీరందని పరిస్థితి. దీంతో రబీలో పంటలు వేయలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా సాగునీరందించే చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– బాగిడి కిష్టయ్య రైతు వడ్డాడి గ్రామం

నవంబర్ నుంచి అందించేలా చర్యలు



ప్రాజెక్టు కుడికాలువ పైపులైన్ పూర్తి కావడంతో పాటు ట్రయల్ రన్ సైతం నిర్వహించాం. కుడి కాలువను అధికారికంగా ప్రారంభించకపోయినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులకు వచ్చే నవంబర్ నుంచి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– హరీశ్‌కుమార్, మత్తడివాగు ప్రాజెక్టు ఏఈ

నారీ.. బీమారి పరారీ

- సత్ఫలితాలనిచ్చిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్'
- జిల్లాలో 209 వైద్యశిబిరాలు నిర్వహణ
- వైద్య పరీక్షలకు ముందుకొచ్చిన మహిళలు
- అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు



మహిళకు స్క్రీనింగ్ చేస్తున్న డీఎంహెచ్‌వో (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో ఈ కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. గత నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. రోగాలను గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సల నిమిత్తం పలువురిని రిమ్స్‌కు రిఫర్ చేశారు. రిమ్స్‌తో పాటు ఉట్నూర్ జిల్లా ఆస్పత్రిలో ఉన్న వైద్య నిపుణులతో జిల్లాలోని ఆయా పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో పరీక్షలు నిర్వహించారు. దాదాపు పక్షం రోజుల పాటు 209 క్యాంపులను ఏర్పాటు చేశారు. వేలాది మంది మహిళలకు స్క్రీనింగ్ చేశారు. ఈఎన్‌టీ, కంటి పరీక్షలు, రక్తపోటు, డయాబెటీస్, దంత పరీక్షలు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, గర్భిణులకు రక్తహీనత పరీక్షలతో పాటు పిల్లలకు పీడియాట్రిక్ సేవలు అందించారు. అలాగే చర్మ వ్యాధులు, పల్మనాలజీ, సైకియాట్రి, క్షయవ్యాధి స్క్రీనింగ్, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షతో పాటు వివిధ రకాల సేవలు అందించారు. ఆరోగ్య నియమాలు, పోషకాహార ఆవశ్యకతను వివరించారు. శిబిరాల్లో పలు రోగాలు నిర్ధారణ అయిన వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

విశేష స్పందన..

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లాలోని 22 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 2 బస్తీ దవాఖానాలు, 67 పల్లె దవాఖానాలు, బోథ్ ఏరియా ఆస్పత్రితో పాటు 5 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఈ శిబిరాలను మహిళల కోసం ఏర్పాటు చేశారు. పిల్లలకు సంబంధించి పీడియాట్రిక్ వైద్యులు 25 క్యాంపులు, గైనిక్‌కు సంబంధించి 33, జనరల్ మెడిసిన్ 23, జనరల్ సర్జరీ 13, డెంటల్ 18, పల్మనాలజీ 17, ఈఎన్‌టీ 19, ఆప్తమాలజీ 23, ఆర్థో 15, దర్మటాలజీ 19, సైకియాట్రిస్టుకు సంబంధించి 4, మొత్తం 209 క్యాంపులు నిర్వహించారు. ఇందులో కాళ్ల నొప్పులకు సంబంధించి 27,167 మహిళలకు, బీపీకి సంబంధించి 17,552, డయాబెటిస్‌కు సంబంధించి 16,780, క్యాన్సర్‌కు సంబంధించి 10,771మంది, అలాగే 1,714 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఎనీమియాకు సంబంధించి 9,938 మందికి, మహిళలతో పాటు 814 మంది ఆడపిల్లలకు వివిధ రకాల టీకాలు వేశారు. 10,552 మందికి ఎనీమియాకు సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించారు. యువతులు, మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. 10,742 మందికి టీబీ పరీక్షలు చేపట్టారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ కిట్లు ఇచ్చేందుకు 376 మంది మహిళలు ముందుకొచ్చారు. సికిల్‌సెల్‌తో బాధపడుతున్న 665 మందికి వైద్య పరీక్షలు చేశారు. దీంతోపాటు ఇతర రుగ్మతలతో బాధపడుతున్న 325 మందికి చికిత్స అందించారు. ఈ కార్యక్రమం ఆయా గ్రామాలు, మండల కేంద్రాల్లో నిర్వహించడంతో మహిళలు ముందుకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

పకడ్బందీగా చేపట్టాం..

జిల్లాలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాం. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళలకు ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించాం. వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు పంపిణీ చేశాం. 50 మందికి కంటిశుక్లాలు ఉన్నట్లు గుర్తించాం. వారికి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే వివిధ రుగ్మతలతో బాధపడుతున్న మహిళలపై ప్రత్యేక దృష్టి సారించాం.

– రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో

పత్తి కొనుగోలులో నిబంధనలొద్దు

- యాప్‌లో నమోదు, తేమ శాతంపై రైతుల్లో గుబులు
- అధిక వర్షాలతో ఈ సారి దిగుబడిపై ప్రభావం

బోథ్: పత్తి రైతుకు ఏటా కొనుగోళ్ల సమయంలో తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ఈ ఏడాది కిసాన్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్లాట్ బుకింగ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అధిక వర్షాల కారణంగా దిగుబడిపై రైతుల్లో గుబులు మొదలవగా.. తాజాగా తేమశాతం విషయంలో సీసీఐ నిబంధనలపై పెదవి విరుస్తున్నారు. ఈ నెల 20 తర్వాత కొనుగోళ్లు మొదలయ్యే అవకాశం ఉండగా.. ఆయా సమస్యలపై రైతులు, రైతు సంఘ నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

సీసీఐ కఠిన నిబంధనలు

ఈ సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్ల నిబంధనలను సీసీఐ కఠినతరం చేసింది. ముఖ్యంగా తేమ శాతం విషయంలో గతంలో 16శాతం వరకు అనుమతి ఉండగా, ఇక నుంచి 12 శాతం దాటితే కొనేది లేదని స్పష్టం చేసింది. అయితే జిల్లాలో తేమ శాతం సహజంగా కొంత ఎక్కువ ఉంటుంది. ఈ నిబంధన వల్ల తాము నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి నిబంధన లేకుండా క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు నూతన యాప్‌లో స్లాట్ బుకింగ్ తప్పనిసరి నిబంధనపై సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఎత్తేయాలి..



సీసీఐ తీసుకువచ్చిన కొత్త యాప్‌తో చదువురాని రైతులకు ఇబ్బందే. స్లాట్ బుక్ చేసుకునేలోపే దళారులు వారిని దోచుకుంటారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాల ఆలస్యం, మరోవైపు తేమ శాతం నిబంధన రైతుల పాలిట శాపమే. వెంటనే నిబంధనలు తొలగించాలి. లేకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తాం

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

యాప్‌లో నమోదు తెల్వదు



మాకు పత్తి పండించడం తెలుసు కానీ ఫోన్‌లో యాప్ పెట్టి స్లాట్ బుక్ చేయడం తెలియదు. నేను చదువుకోలేదు. కొత్త నిబంధనల పేరుతో మా లాంటి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు. పాత పద్ధతిలోనే పత్తిని కొనాలి.

– జాదవ్ బాపూజీ, రైతు, బాబేరతండా,బోథ్

తేమ శాతం నిబంధన ఉండొద్దు



అధిక వర్షాల కారణంగా పత్తిలో తేమ శాతం కచ్చితంగా పెరుగుతది. అయితే 12 శాతానికి మించితే కొనుగోలు చేయబోమని సీసీఐ చెప్పడం సరికాదు. తేమ తగ్గించుకోవడానికి మాకు సరైన సౌకర్యాలు కూడా లేవు. ప్రభుత్వం దీనిపై సడలింపులు ఇవ్వాలి.

– కలాలి అశోక్, రైతు, వడూర్, నేరడిగొండ (మం)

పాత పద్ధతిలోనే కొనాలే..



పత్తి కొనుగోలులో తేమ శాతం, యాప్‌లో నమోదు వంటి నిబంధనలు సరికాదు. నాకు పెద్ద ఫోన్ లేదు. మా ఊరిలో సిగ్నల్ కూడా సరిగా రాదు. బోథ్‌కు వెళ్లి బుక్ చేసుకోవాల్సి వస్తది. పాత పద్ధతిలోనే నేరుగా సీసీఐకి అమ్మేలా చూడాలి.

– బెంగాలాల్, రైతు, బాబేరతాండ, బోథ్ (మం)

ఇంకా కేంద్రాలు ఏర్పాటు చేయలే..



పత్తి చేతికొచ్చే సమయం వచ్చినా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలే. ఇప్పటికే అధిక వర్షాలతో దిగుబడి అంతంత మాత్రమే వచ్చే పరిస్థితి. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యమైతే దళారులకు అమ్మి నష్టపోక తప్పదు.

– పదాల పొచ్చెన్న, కప్పర్ల, తాంసి (మం)

గిన్నిస్ రికార్డులో జిల్లావాసులు



గిన్నిస్‌లో చోటు దక్కించుకున్న మిట్టు దత్తు, జగన్నాథ ఋషి

ఆదిలాబాద్: తమిళనాడు రాజధాని చెన్నై వేదికగా సీవీఎస్ కాలేజ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన కరాటే గిన్నిస్ రికార్డు ఈవెంట్లో జిల్లాకు చెందిన మాస్టర్లు మిట్టు దత్తు, గాజుల జగన్నాథ ఋషి పాల్గొని చోటు దక్కించుకున్నారు. ఫేస్ పంచ్, మిడిల్ పంచ్, లోయర్ పంచ్ వంటి విన్యాసాలు ప్రదర్శించడమే కాకుండా కరాటే డెమోన్‌స్ట్రేషన్ ఏకధాటిగా చేసి రికార్డులో స్థానం దక్కించుకున్నట్లు మాస్టర్ మిట్టు రవి తెలిపారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



తాడిహత్నూర్‌లో పట్టుకున్న బియ్యం

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న పీడీఎస్ బియ్యం ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై అఖిల్ తెలిపారు. కోటగిరి విశాల్, చింతావార్ సత్యనారాయణ పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి 2.80 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉచిత బియ్యం అక్రమంగా తరలించినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య



మణికంఠ మృతదేహం

లక్సెట్టిపేట: బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని క్లబ్ రోడ్‌కు చెందిన రాథోడ్ మణికంఠ (20) మంచిర్యాలలోని కళాశాలలో ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పది రోజులుగా బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులను అడుగుతున్నాడు. ఈ నెల 4న సాయంత్రం బైక్ కొనివ్వాలని పట్టుబట్టడంతో కొన్నిరోజుల తర్వాత కొనిస్తామని తల్లిదండ్రులు సర్దిచెప్పారు. అయినా వినకుండా ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి దారాసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ...



వినోద్ (ఫైల్)

లక్ష్మణచాంద: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన తుడిగని వినోద్ (35) కొంతకాలంగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 3న మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న లారీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బీర్సాయిపేట గ్రామ సమీపంలో ఆదివారం గుంతను తప్పించబోయి లారీ చెట్టును ఢీ కొట్టింది. జన్నారం నుంచి ఉట్నూర్ వైపు బయలుదేరిన లారీ మంచిర్యాల–ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి ప్రమాదవశాత్తు చెట్టును ఢీ కొట్టింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయట పడ్డారు. ఇటీవల ఓ ప్రైవేటు బస్సు సైతం ఈ గుంతలో పడిపోవడంతో ముందు టైర్లు ఊడిపోయిన సంఘటన నెలకొంది. పెద్ద ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరగకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఒకరిపై పోక్సో కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక(11)తో అసభ్యంగా ప్రవర్తించిన ఫయ్యాజ్ ఖాన్‌పై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. నాగ్‌పూర్‌కు చెందిన ఫయ్యాజ్ అదే కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బాలిక ఇంట్లో ఎవరూలేని సమయంలో లోనికి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు గమనించి తల్లికి సమాచారం ఇవ్వడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలం కోహినూర్(కే) గ్రామంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గంగారం తెలిపారు. మేస్రం జుగాది రావు చేనులో 6, మేస్రం గంగారాం చేనులో 4 మొక్కలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

ఇంద్రవెల్లి: చోరీ కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని మోహన్‌సింగ్‌తండాకు చెందిన రవిబాను అదేగ్రామంలో కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి షాపు తెరిచి చూడగా షటర్ కొంచెం పైకి లేచి ఉంది. అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉంచిన రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా మడండి రమేశ్, కనోడే విఠల్‌ను అరెస్ట్ చేసి విచారించడంతో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భీం ఆశయం నెరవేరేదెన్నడో!

'జల్, జంగల్, జమీన్' నినాదంతో భూమి, నీరు, అడవిపై ఆదివాసీలకు హక్కులకోసం నిజాం ప్రభుత్వంతో జరిపిన పోరాటంలో అసువులు బాసిన గిరిజనుల ముద్దుబిడ్డ కుమురంభీం. ఆయన మరణించి 85 ఏళ్లు కావస్తున్నా ఆశయం మాత్రం ఇప్పటికీ నెరవేరలేదు. నేటికీ గిరిజనులు తాగు, సాగునీరు, రోడ్డు సౌకర్యం, సాగు చేస్తున్న భూములకు పట్టాలులేక అలమటిస్తున్న పల్లెలు అనేకం ఉన్నాయి. ఈ నెల 7న కుమురంభీం 85వ వర్ధంతి సందర్భంగా కథనం.



ఆదివాసీలు నివాసం ఉంటున్న పెంకుటిండ్లు

- గిరిజన చట్టాలను కాలరాస్తున్న పాలకులు
- 5వ షెడ్యూల్‌కు తూట్లు
- ప్రేక్షక పాత్రలో అధికారులు
- రిజర్వేషన్లతో ఆదివాసీల్లో ఆందోళన

కడు దయనీయం

కెరమెరి(ఆసిఫాబాద్): నాటి నుంచి నేటి వరకు ఆదివాసీల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. భూమి, నీరు, అడవిపై ఇంకా హక్కులు రాలేదు. గిరిజన చట్టాలు గిరిజనేతరులకు చుట్టాలవుతున్నాయి. అప్పటి నిజాం సర్కారు ఆదివాసీ భూముల రక్షణకోసం భూ బదలాయింపు చట్టం 1/70 తీసుకువచ్చింది. కానీ అధికార యంత్రాంగం ఆదివాసీల భూముల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూములను గిరిజనేతరులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకుంటున్నారు. భూ బదలాయింపు నిషేధం ఉన్న షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరిగి భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గిరిజనులు మళ్లీ అడవిలో చెట్లను నరుక్కుని బతకాల్సిన పరిస్థితులు దాపురించాయి. అందులో కూడా గిరిజనులను బతకనీయకుండా అటవీశాఖ అధికారులు తరిమేస్తున్నారు.

ఉపయోగంలోకి రాని ఐదో షెడ్యూల్

భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం అడవి, భూమి, నీటిపై గిరిజనులకు పూర్తి హక్కులు ఉన్నప్పటికీ నూతన చట్టాలు వాటికి తూట్లు పొడుస్తున్నాయి. 2005లో బిల్లు ప్రవేశపెట్టి హక్కులను కల్పిస్తామని గత ప్రభుత్వాలు చెప్పినా అవి అమలు కాలేదు. ఐటీడీఏ నిధులతో నిర్మించిన కుంటలు, చెరువుల్లో పెంచుతున్న చేపలు, రొయ్యలపై ఆదివాసీలకే హక్కులున్నాయని చట్టాలు చెబుతున్నా వారి గోడు పట్టించుకునే వారు కరువయ్యారు. కొంత కాలంగా వలసలుగా వచ్చినవారు ఎస్టీలుగా చలామని అవుతూ నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు.



జోడేఘాట్‌లోని కుమురం భీం విగ్రహం

రిజర్వేషన్లతో ఏజెన్సీలో గుబులు

5వ షెడ్యూల్ గిరిజన చట్టం ప్రకారం ఏజెన్సీలో గిరిజనేతరులకు రిజర్వేషన్‌లలో అవకాశం ఉండదు. కానీ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలోనూ గిరిజనేతరులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించారు. ఈ క్రమంలో 5వ షెడ్యూల్ అమలులో ఉండగా ఇదెలా సాధ్యమని, భవిష్యత్‌లో ఉద్యమ కార్యచరణ చేపట్టనున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

చట్టాలు పకడ్బందీగా అమలు



ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలు, హక్కులు అమలు కావడంలేదు. దీంతో గిరిజన నిరుద్యోగులు, సామాన్య ప్రజలు అన్యాయానికి గురవుతున్నారు. జీవో 3 స్థానంలో మరో జీవో తీసుకువచ్చి ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. 5వ భూభాగాన్ని రక్షించాలి.
– కోవ విజయ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు, కుమురంభీం ఆసిఫాబాద్

కనుమరుగవుతున్న జీవోలు

ఆదివాసీల రక్షణ కోసం ఏర్పాటు చేసిన జీవోలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు వందశాతం గిరిజనులకే చెందాలని పొందుపర్చబడ్డ జీవో 3ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఏజెన్సీలోని గిరిజనులకు 50 శాతం మించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీకి సంబంధం లేకుండా గిరిజనేతరులను భర్తీ చేసింది.

కొలాం వీరుడికి సలాం..!

నిస్సహాయులుగా, నిస్తేజంతో సతమతమవుతున్న కొలాం ఆదివాసీల్లో స్వాతంత్రేచ్ఛను రగిల్చిన ఖ్యాతి కుమురం సూరుకే దక్కుతుంది. రేపు కుమురం సూరు 28వ వర్ధంతిని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా కథనం.

- జోడేఘాట్‌లో రేపు కుమురం సూరు 28వ వర్ధంతి
- రాష్ట్రం నలుమూలల నుంచి రానున్న కొలాం ఆదివాసీలు



కుమురం సూరు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌కు చెందిన కుమురం చిన్ను, మారుబాయి దంపతులకు 1918లో కుమురం సూరు జన్మించారు. చిన్నతనం నుంచి అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నాడు. గోండు, కొలాం జాతి ప్రజలు వెనుకబడడానికి కారణం నిజాం ప్రభుత్వమేనని గుర్తించి నిజాం నవాబులు, తాబేదారులు, రజాకార్లు కొనసాగిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలను సహించలేకపోయాడు. తన జాతికి ఉక్కు సంకెళ్ల నుంచి విముక్తి కల్పించాలని నిర్ణయించాడు. ఆ సమయంలోనే కుమురంభీం జోడేఘాట్‌కు రావడంతో వారిలో నూతనోత్తేజం నింపింది. కొలాం, గోండులను ఏకంచేసి భీంకు అండగా నిలిచాడు. అలా సమకూరిన బలంతోనే జోడేఘాట్ పరిసరాల్లో 12 గ్రామాలు వెలిశాయి. ఆయా గ్రామాలను ఆనుకుని ఉన్న వంద ఎకరాల భూమిని ఆదివాసీలు సాగు చేస్తున్నారు. అట్టి భూములను నిజాం రజాకార్లు ఆక్రమించేవారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్ నిజాం సాహెబ్‌కు మొరపెట్టుకున్న స్పందించలేదు.

జల్, జంగల్, జమీన్

ఈక్రమంలో కుమురంభీం నాయకత్వంలో జల్ జంగల్ జమీన్ నినాదంతో ఉద్యమం ప్రారంభమైంది. ఆదివాసీలపై చిత్రహింసలకు పాల్పడిన నిజాం మిలటరీతో పలుమార్లు యుద్ధం సాగింది. దీంతో 1938–40 లో ఆసిఫాబాద్ తహసీల్దార్ కుమురంభీం ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. భీం జాడ చూపాలని సూరును నిజాం మిలటరీ చిత్రహింసలు పెట్టింది. ఇలా కొన్నాళ్లు సాగిన పోరాటంలో అనేక మంది ఆదివాసీలు ప్రాణాలు కోల్పోయారు. మడావి కొద్దు భీం ఆచూకీ తెలపడంతో నిజాం మిలటరీ కాల్చిచంపింది. అదే పోరాటంలో సూరు కుడి చేయి, కుడి కాలు పోగొట్టుకున్నాడు. తన ప్రాణాలు కాపాడుకునేందుకు సమతుల గుండంలో ఆరు మాసాలు అజ్ఞాతంలో ఉన్నాడు.



జోడేఘాట్‌లోని కుమురం సూరు విగ్రహం

ఆదివాసీ కొలాం క్రాంతివీర్

1975లో ఐటీడీఏ ఏర్పడిన తర్వాత అధికారులతో చర్చించి కుమురంభీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు సూరు కృషి చేశాడు. 1980లో కొలాం గ్రామాలలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కొలాం ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశాడు. 1986లో ఐటీడీఏలో కొలాం అభివృద్ధి అధికారిగా సూరును నియమించారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం 'ఆదివాసీ కొలాం క్రాంతివీర్' అనే బిరుదును ఇచ్చింది. ఆ తర్వాత 1997 ఆగస్టు 10న ఆశ్వియుజ పౌర్ణమి రోజున ఆసిఫాబాద్ మండలం శాకన్‌గొందిలో సూరు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అధికారికంగా జోడేఘాట్‌లో సూరు 28 వర్ధంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కొలాం ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాహుల్ (ఫైల్)

గుడిహత్నూర్: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా గుమ్‌గావ్‌కు చెందిన భగ్నూరే రాహుల్ (35)కు మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన లక్ష్మీబాయితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. రాహుల్ తన భార్యతో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయని గుమ్‌గావ్‌లో ఉన్న తండ్రి బాలాజీతో ఫోన్‌లో చెప్పేవాడు. శనివారం రాత్రి తండ్రికి ఫోన్‌చేసి తన భార్యతో గొడవ జరిగిందని చెప్పి వెంటనే కట్ చేశాడు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన వ్యక్తి ఫోన్‌చేసి మీ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందించాడు. కోడలు లక్ష్మీబాయి, ఆమె తల్లి షిండే లలితపై అనుమానం ఉందని మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో రాంటెక్ వాసి..



జనార్దన్ (ఫైల్)

ముధోల్: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంటెక్ వాసి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన కొమురెపెల్లి జనార్దన్ (55) మహారాష్ట్రలోని పూణేలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లాడు. శనివారం తిరుగుప్రయాణంలో ప్రైవేటు ట్రావెల్స్‌లో వస్తుండగా పూణే శివారులో మార్గ మధ్యలో హోటల్ వద్ద వాహనాన్ని ఆపారు. అయితే కాలకృత్యాలు తీర్చుకునేందుకు జనార్దన్ రోడ్డు దాటుతుండగా మహారాష్ట్రకు చెందిన వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి ఆదివారం స్వగ్రామం రాంటెక్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

బతుకమ్మ వేడుకల్లో అపశృతి

- వేర్వేరు చోట్ల అస్వస్థతకు గురై ఇద్దరు మహిళలు మృతి



రుషిత (ఫైల్)



భాగ్యలక్ష్మి (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పహాడ్ గ్రామానికి చెందిన రుషిత (22) శనివారం రాత్రి బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అందరితో కలిసి వేడుకల్లో పాల్గొన్న మహిళ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించేలోగానే మృతి చెందింది.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన బిట్లింగ్ భాగ్యలక్ష్మి (56) శనివారం బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై కుప్పకూలింది. కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. డీజే సౌండ్ కారణంగానే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కుటుంబ తగాదాలతో యువకుడి బలవన్మరణం



బీరేష్ (ఫైల్)

వేమనపల్లి: కుటుంబ తగాదాలతో ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై కోటేశ్వర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాజారం గ్రామంలోని కుర్మగూడెంకు చెందిన దైవాల బీరేష్ (22) తాత మల్లయ్య గతేడాది మృతి చెందగా శనివారం 9 నెలల మాసికం కార్యక్రమం నిర్వహించారు. భోజనాల అనంతరం కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన బీరేష్ సాయంత్రం ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని ఎల్లమ్మ గుట్ట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి మొండి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి

ముధోల్: ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన సయ్యద్ కాశీం అలీ (54) పంటచేను చెరువుపక్కనే ఉంది. ఆదివారం ఉదయమే పొలానికి వెళ్లిన అలీ స్నానం చేసేందుకు చెరువులో దిగడంతో ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఒకరిపై పీడీయాక్టు



చర్లపల్లి జైలుకు తరలిస్తున్న సీఐ

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన అల్తాఫ్‌పై ఆదివారం పీడీ యాక్టు కేసు నమోదు చేసినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. నిందితుడు గతంలో అటవీ అధికారులు, పోలీసులపై దాడి చేయడంతో ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో 11 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడు కొంతకాలంగా పలు కేసుల్లో ప్రధాన పాత్ర పోషిస్తూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



మంచిర్యాలటౌన్ : జిల్లా కేంద్రంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



దస్తురాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చిన్ననాటి స్నేహితులు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు మళ్లీ 25 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–1996 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పీచరలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు గాజులు వేసుకుని శుభాకాంక్షలు తెలుపుకోగా పురుషులు శాలువాలు కప్పుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.



లక్ష్మణచాంద: పీచరలో కలిసిన 1996 బ్యాచ్ మిత్రులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని సీసీసీ కార్నర్‌లో గల స్వాతి హైస్కూల్‌లో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణరాజు, అధ్యాపకులు మంజుల, మూర్తి, భాను, సత్యం, రవి, రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

50 ముఖాల దుర్గామాత నిమజ్జనం



నిమజ్జనానికి తీసుకువచ్చిన దుర్గామాత

బాసర: నిజామాబాద్ జిల్లాలోని వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 50 ముఖాలతో ఉన్న అతిపెద్ద దుర్గామాత విగ్రహాన్ని ఆదివారం బాసర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మొట్టమొదటి సారిగా 50 ముఖాలతో ఉన్న దుర్గాదేవి అమ్మవారి విగ్రహం నదికి తీసుకురావడంతో తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి

- ఆవు, ఎద్దు మృతి
- ప్రాణాలతో బయటపడిన రైతు, మరో ఎద్దు

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమగూడెం పాతబస్తీ శివారులో ఉన్న వాగులో ఎడ్లబండి కొట్టుకు పోయిన ఘటనలో ఆవు, ఎద్దు మృతి చెందగా రైతు, మరో ఎద్దు ప్రాణాలతో బయట పడ్డారు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లంబాడితండాకు చెందిన బానోత్ బలరాం పెద్దనపల్లి శివారులో పొలం పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం పొలం వద్ద ఉన్న ఎద్దు, ఎడ్లబండిని తీసుకు వచ్చేందుకు కాలినడకన వెళ్లాడు. వెళ్తున్న క్రమంలో వాగు దాటగా మోకాలి లోతులో ఉండటంతో పొలం వద్దకు వెళ్లి ఎడ్లబండి సహా మరో ఆవును బండికి కట్టుకొని బయలు దేరాడు. వెళ్లేటప్పుడు వాగు లోతు తక్కువగా ఉండటంతో అదే నమ్మకంతో చీకట్లో వాగు దాటుతుండగా వరద ఉధృతి పెరిగి ఎడ్లబండి కొట్టుకు పోయింది. ఈక్రమంలో తనకు ఒక చెట్టు కొమ్మ దొరకడంతో పట్టుకుని ఎద్దును ఎడ్లబండి నుంచి వేరు చేసి కాపాడాడు. దీంతో ఎద్దు, మరో ఆవు ఎడ్ల బండితో సహా కొట్టుకు పోయి మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దు, ఆవు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని వాపోయాడు.



మృతి చెందిన ఎద్దు

మామిడిలో యాజమాన్య పద్ధతులు

- సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు

చెన్నూర్‌రూరల్: జిల్లాలో మామిడి సాగుపై ఆధారపడి ఎంతోమంది రైతులు జీవిస్తున్నారు. మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన అధికారి కళ్యాణి తెలిపారు. ఇప్పటి నుంచి నాలుగు నెలల కాలం మామిడి పంటకు కీలకమైందని, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పూతకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అక్టోబర్ నుంచి మామిడి చెట్లకు నీరుపెట్టడం పూర్తిగా ఆపేయాలి. లేదంటే చెట్టు శాఖీయంగా బాగా పెరగడంతో పాటు పూత రావడం ఆలస్యం అవుతుంది. పూత రావడం అనేది రాత్రి పూట చల్లని వాతావరణం, పగటి పూట ఉన్న ఎక్కువ ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత కనీసం 13 డిగ్రీల సెంటీగ్రేడ్ చేరుకునేలా కనీసం 15 రోజుల పాటు కొనసాగితే పూత వస్తుంది. వాతావరణ పరిస్థితులు కొమ్మల్లోని హార్మోన్ల నిష్పత్తి కొమ్మకు తగినంత వయసు అనేది పూత రావడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

పూత బాగా రావాలంటే..

పూత బాగా రావాలంటే కొత్తగా వచ్చే చిగుర్లపై 5 గ్రాములు జింక్ సల్ఫేట్, 2 గ్రాములు బోరాక్స్, 10 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు ఆశించకుండా..

అక్టోబర్ మాసం నుంచి మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు లేత కొమ్మలను ఆశించి నష్ట పరుస్తాయి. తేనె మంచు పురుగు తల్లి, పిల్ల పురుగు లేత ఆకులు, పూల కొమ్మలపై గుంపులు, గుంపులుగా చేరి రసం పీల్చుతాయి. దీంతో కాడలు, కొమ్మలు మాడి పూత, పిందె ఏర్పడదు. ఒక వేళ ఏర్పడినా బలహీన పడతాయి. దీని నివారణకు ఈ మాసంలో కార్బాలిల్ 3 గ్రాములు, ఆర్బిన్ 1గ్రాము. నువాన్ ఒక మిల్లీ లీటరు, 5 మిల్లీ లీటర్ల వేప నూనె, కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు, కాండం కొమ్మల నుంచి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి. తామర పురుగు లేత కొమ్మలను ఆశించి రసంపీల్చడం ద్వారా పూకొమ్మలు రాతి రంగుకుమారి మాడి పోతాయి. నివారణకు రీజెంట్ 2 మిల్లీలీటర్లు, ఎసిఫేట్ 1.5 గ్రాములను లేత కొమ్మలు, ఆకులపై పిచికారీ చేయాలి.

బూడిద తెగులుతో జాగ్రత్త... .

ఈ మాసంలో బూడిద తెగులు పూల కొమ్మలను ఆశించి నష్ట పరుస్తుంది. తెల్లని బూడిద లాంటి పొడి ఆకులు, పూత కాడలపై కనిపిస్తుంది. తెగులు సోకిన భాగాలు నల్లగా మారి ఆకులు, పూల కాడలు సక్రమంగా పెరగవు. ఈ తెగులు వల్ల పంటకు 30 నుంచి 60 శాతం వరకు నష్టం కలుగుతుంది. దీని నివారణకు మూడు గ్రాములు నీటిలో కరిగే గంధకం (సల్ఫర్)ను పువ్వు వచ్చే కాడలు, కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలి. హెక్సాకొనజోల్ మందును 2 మిల్లీ లీటర్లు తీసుకుని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నవంబర్ నెలలో మామిడి తోటకు బెట్ట పరిస్థితులు కల్పిస్తూ సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తోటల్లో అధిక పూత పొందవచ్చు.